సాక్షి తిరుపతి

బుధవారం । 10 । జూలై । 2024



ఎర్రస్మగ్లర్లను అడ్డుకున్న ..

శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. - 8లో



కాటేసిన మహమ్మారి!

డయేరియా కాటేసింది. ఇద్దరు మానసిక వికలాంగులను పొట్టనబెట్టుకున్న ఘటన విషాదాన్ని మిగిల్చింది. - 8లో



భవిత విద్యార్థులు భేష్

పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో సత్తాచాటిన భవిత విద్యార్థుల ప్రతిభను డీఈఓ వీ.శేఖర్ కొనియాడారు. - 8లో

న్యూస్‌రీల్

కల్తీ మద్యం తయారీపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

తిరుపతి అర్బన్: కల్తీ మద్యం తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ, సెబ్ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మద్యం దుకాణాలను తరచూ తనిఖీలు చేయాలన్నారు. అక్రమాలకు తావులేకుండా అడ్డుకట్టవేయాలని పేర్కొన్నారు. అక్రమ రవాణాతోపాటు అక్రమ నిల్వలు, సారా అమ్మకాలు ఒక్క శాతం కూడా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి జానకీరామ్ మాట్లాడుతూ జిల్లాలో తిరుపతి డిపో నుంచి 148 దుకాణాలకు, ఓజిలి డిపో నుంచి 95 దుకాణాలకు, లైసెన్స్ పొందిన బార్లుకు 24 వాహనాల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 240 దుకాణాలపై నిత్యం నిఘాపెట్టినట్లు వెల్లడించారు. రేణిగుంట మండలం గాజులమద్యం వద్ద ఎస్వీఆర్ డిస్టిలరీ(మ్యాన్‌ఫ్యాక్చరింగ్) వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజేంద్ర మాట్లాడుతూ జిల్లాలో 2023లో 102, 2024 జూలై 8 వరకు 950 కేసులు, మొత్తం 1052 కేసులను డీపీఎల్ కింద బుక్ చేసినట్లు వివరించారు. సమావేశంలో ఓజిలి డిపో మేనేజర్ నాగమల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

తిరుపతి క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని, దాన్ని అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని క్రైమ్ ఎస్పీ విమలకుమారి స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ సెనేట్ హాల్లో సంయుక్త ధూమపాన నిషేధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు నమిలి తినడం వల్ల, సిగరెట్ తాగడం వల్ల, గుట్కా పాన్ పరాగ్ తినడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. కూలి పని చేసుకునే పేదవాళ్లు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలేజీలు, స్కూళ్లకు సుమారు 100 మీటర్ల దూరంలో మత్తు పదార్థాలు విక్రయించే షాపులు ఉండకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ అధికారి పద్మావతి, డీఈఓ శేఖర్, సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

అసలే గద్దలు. ఆ గద్దలకు 'అధికార' రాబందు తోడయ్యింది. ఇంకేముంది. అన్నీ కలిసి ఆధ్యాత్మిక నగరంపై వాలిపోయాయి. కళ్లు మూసి తెరిచేలోపు రూ.100 కోట్ల విలువ చేసే దేవుడి మాన్యాన్ని అమాంతం మింగేశాయి. అభ్యంతరం చెప్పిన దేవదాయశాఖ సిబ్బందిపై దాడులకు తెగబడ్డాయి. బట్టలు విప్పి, మోకాళ్లపై కూర్చోబెట్టారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నానాబూతులు తిట్టి నిర్బంధించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నా 'డోంట్ కేర్' అంటూ వారి ఎదుటే... దేవుడి మాన్యానికి దర్జాగా కాంపౌండ్ వేశారు. ఇళ్ల స్థలాల కింద బహిరంగ మార్కెట్లో బేరం పెట్టేశారు. పోలీస్ స్టేషన్లో పంచాయితీ పెట్టిన దేవదాయ శాఖ అధికారులను పోలీసుల ఎదుటే కొట్టబోయారు. 'నోరు మెదిపితే భూమ్మీద నూకలు చెల్లిపోతాయి'అంటూ బెదిరించారు. ఇదంతా ఎక్కడో మారుమూలున్న కొండల్లోనో గుట్టల్లోనో జరగలేదు. తిరుపతి నగర నడిబొడ్డున అందరూ చూస్తుండగానే జరిగిన సంఘటన ఇది.

తిరుపతిలో ల్యాండ్ మాఫియా



నాని.. ఆక్రమించుకున్న దేవుడి మాన్యం ఇదే

- రూ.100 కోట్ల భూమి హాంఫట్
- కొనసాగుతున్న నాని ఆక్రమణల పర్వం
- 'నాని ఖాతా'లోకి మరో 3 ఎకరాలు
- మరో నాలుగు ఎకరాలపై కన్ను
- చిత్తూరులో మధ్యస్తంతో చంద్రగిరి ఎమ్మెల్యేకి రూ.52 కోట్లు
- దేవదాయ శాఖ సిబ్బంది బట్టలిప్పి మోకాళ్లపై కూర్చోబెట్టిన 'చిత్తూరు గ్యాంగ్'
- ప్రాణభయంతో పోలీసులకు దేవదాయశాఖ ఫిర్యాదు
- అధికార పార్టీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు, ఆందోళనలకు సిద్ధం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి నగరంతోపాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో హథీరాంజీ మఠం భూములు ఉన్నాయి. వీటిని దేవుడి మాన్యం భూములుగా పరిగణిస్తారు. ఈ భూముల విషయమై తరచూ వివాదాలు నడుస్తుంటాయి. అలాగే తిరుపతి నడిబొడ్డున అటు అవిలాల, లింగేశ్వరనగర్, ఇటు బైరాగి పట్టెడ ప్రాంతాల నడుమ 145, 147/1 సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో మూడో వంతు భూమి హథీరాంజీ మఠం భూమి, నాలుగోవంతు భూమి పరకాల మఠం భూమి. దీనికి సంబంధించి అనేక డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. ఈ భూమి విలువ కనీసం రూ.100 కోట్లకుపైమాటే. ఆ భూమి తమదంటూ ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డి అనే వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. హథీరాంజీ మఠం ఆధీనంలో ఉన్న ఆ భూమిపై కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో గత ప్రభుత్వంలోని అధికార పెద్దలెవ్వరూ వారికి సహకరించలేదు. దీంతో వారి ఆటలు సాగలేదు. సరిగ్గా నెల కిందట ప్రభుత్వం మారింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డికి రెక్కలొచ్చాయి. 'మాఫియా' తమకు అండగా 'చిత్తూరు గ్యాంగ్'ను అప్పటికే రంగంలోకి దింపింది. ఎలాగైనా ఆ భూమి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు.

స్థానికులకు, పోలీసులకు చెరో రూ.50 లక్షలు

స్థానికంగా మూడు పంచాయతీల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో 50 మందిని భయపెట్టి తలకు రూ.లక్ష చొప్పున ఇచ్చి నోరు మూయించారు. అదే సమయంలో పోలీసులు సహకరించేందుకు రూ.50 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

మరో నాలుగు ఎకరాలపై కన్ను

ఈ భూమికి ఎదురుగానే మరో నాలుగు ఎకరాల హథీరాంజీ భూమి ఉంది. ఇందులో కంపచెట్లు నిండుగా ఉన్నాయి. వాటిని తొలగించి దానిని కూడా ఆక్రమించడానికి ల్యాండ్ మాఫియా సిద్ధమైపోతోంది. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నానీ పలువురికి తన తడాకా చూపించారు. తిరుపతి రూరల్‌లోని ఓ రైస్ మిల్లు మూయించకుండా ఉండడానికి రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. అతను రూ.50 లక్షలు ఇస్తామన్నా వినకుండా రైస్‌మిల్లుని మూయించారు. టీటీడీ కాంట్రాక్టరును బెదిరించి రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని రాయించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో మూడు ఎకరాల స్వాధీనం చేసుకున్నారు. ఇంకో నాలుగు ఎకరాలకు స్కెచ్ వేశారు. ఈ వ్యవహారాలను తిరుపతిలో 'చిత్తూరు గ్యాంగ్' సహకారంతో తన ఆక్రమణల పరంపరను నాని కొనసాగిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లోనూ రెచ్చిపోయిన 'మాఫియా'

చూస్తూ.. చూస్తూ అంత విలువైన భూమి దురాక్రమణకు గురికాకుండా చూడాలనే ఉద్దేశంతో మఠం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పైగా తమకు ఆ 'మాఫియా' వలన ప్రాణాపాయం ఉందని, తమను నిర్బంధించి మోకాళ్లపై నిల్చోబెట్టారని జరిగిన తతంగాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై చంద్రగిరి డీఎస్పీ జూన్ 11న 'మాఫియా' సభ్యులను, దేవదాయ శాఖ అధికారులను అక్కడకు పిలిపించుకున్నారు. మాఫియా సభ్యులు అక్కడ కూడా దేవదాయ శాఖ అధికారులపై తిట్ల పురాణం అందుకున్నారు. ఓ దశలో అధికారులపై దాడి చేయబోయారు. 'ప్రభుత్వం మాది, ఎమ్మెల్యే మా నాని అన్న', 'మేము చెప్పిందే జరుగుతుంది, జరగాలి' 'ఆ భూమి మాది, దేవుడి మాన్యం, మఠం భూములంటే తంతాం.. నీ దిక్కున్న చోట చెప్పుకో... కాదంటే నీవు ఎక్కడ పని చేస్తావో మేమూ చూస్తాం.' అంటూ అధికారులపై మరళా విరుచుకుపడ్డారు. ఇదంతా పోలీసుల ఎదుటే జరిగింది. 'మాఫియా', 'చిత్తూరు గ్యాంగ్'పై దేవదాయ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకూ అతీగతీ లేదు. కనీసం ఎఫ్ఐఆర్ కట్టలేదు. ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు.

ఒకే డీల్.. నానికి రూ.52 కోట్లు

ఒప్పందంలో భాగంగా ఉచితంగా తీసుకున్న మూడెకరాలకు రూ.30 కోట్లు, అభివృద్ధి కింద తీసుకున్న ఏడెకరాల్లో తన వాటా కింద రూ.22 కోట్లు.. మొత్తం ఒకే డీల్‌తో నాని ఖాతాల్లోకి రూ.52 కోట్లు జమచేసుకోనున్నారు. పులివెందులకు చెందిన నవీన్ అనే వ్యక్తిని భాగస్వామిగా చేర్చుకుని ఆ భూమిని పక్కా ప్రణాళికతో ప్రహరీలోపల గుట్టుచప్పుడు కాకుండా పాట్లు వేసి అమ్మేస్తున్నారు. అంకణం స్థలం రూ.1.5 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు.

అధికారపార్టీ నేతల దౌర్జన్యాలను చూస్తున్న స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇందుకేనా టీడీపీకి ఓటేసిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దేవుని భూములను కూడా వదలరా? అంటూ మండిపడుతున్నారు. తిరుపతి నడిబొడ్డున ఇంత దురాక్రమణ జరుగుతుంటే కూటమిలోని పార్టీలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఏం చేస్తున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలా దౌర్జన్యాలు, ఆక్రమణలు కొనసాగితే ఆందోళనలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

పనులు ప్రారంభం

జూన్ 9 తేదీన ఉదయం 7 గంటలకు ఆ భూమి చుట్టూ ప్రహరీ గోడ వేయడానికి పనులు ప్రారంభించారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ కలిసి అదే నెల 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఓ ఆరుగురు ఆ స్థలం వద్దకెళ్లి ప్రహరీ నిర్మించడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ 100 మందికిపైగా చిత్తూరు గూండాలు కాపుకాస్తున్నారు. 'మేమెవరో తెలియదా?, ఎంత ధైర్యం ఉంటే ఇక్కడికి వస్తావ్?, నాని అన్న అంటే భయం లేదా?, మేము మీకు ప్రత్యేకంగా బొట్టు పెట్టి చెప్పాలా? ఎలా వచ్చారో? అలాగే ... మూసుకుని వెళ్లండి' అంటూ బెదిరింపులకు దిగారు. అయినా మఠం అధికారులు కుదరదు, ఇది మఠం భూమి.. పనులు ఆపాల్సిందేనంటూ గట్టిగా వాదించారు. కోపోద్రిక్తులైన చిత్తూరు గ్యాంగ్ మఠం సిబ్బందిని తాత్కాలికంగా నిర్మించుకున్న గదిలోకి తీసుకెళ్లి బట్టలు ఊడదీయించారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నోటికొచ్చినట్లు బండ బూతులు తిట్టారు. సుమారు మూడు గంటల పాటు ప్రాణభయంతో అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు చిత్తూరు గ్యాంగ్ కాళ్లావేళ్లా పడి బతుకుజీవుడా అంటూ అక్కడి నుంచి మఠం కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన విషయాలను మఠం పరిపాలనాధికారికి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ తతంగమంతా ఎమ్మార్ పల్లె పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో చోటు చేసుకుంది. ఇంత జరుగుతున్నా పోలీసులు తమను కాపాడలేదని కన్నీరుపెట్టుకున్నారు.



ఆక్రమిత స్థలంలో దర్జాగా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్

నాకు మూడు, మీకు ఏడెకరాలు.. ఇదీ నాని ఫిక్సింగ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాని రంగంలోకి దిగారు. ఎంకే నాయుడు, నరసింహారెడ్డి, సేతమాధవ్‌ని ఆ నాయకుడు చిత్తూరుకి పిలిపించారు. తనకు మూడెకరాలు కేటాయిస్తే, ముగ్గురికి ఏడెకరాలు తీసుకోమని హుకుం జారీ చేశారు. ఈ భూమికి సంబంధించి మఠం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ రాకుండా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగని చంద్రగిరి ఎమ్మెల్యే నాని.. ఆ ఏడెకరాలను తానే కొనుగోలు చేసుకుంటానని చెప్పడంతో ఆ ముగ్గురు షాక్ అయ్యారు. ఆ ఏడెకరాలకు రూ.25 కోట్లు చెల్లిస్తానని, ఆ నగదుని ముగ్గురు పంచుకోమని స్పష్టం చేశారు. చేసేదేమీ లేక ముగ్గురూ తెల్లముఖం వేశారు. ఒక్కదెబ్బతో పదెకరాల నుంచి అధికారపార్టీ నేతకు రూ.52 కోట్లు రాబట్టుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఈ మొత్తంలో అమరావతిలోని మరో ముఖ్యనేత వాటా ఇవ్వాలని చెప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

త్వరితగతిన బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణం



బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి(అలిపిరి): పెండింగ్‌లోని బీఎస్ఎన్ఎల్ టవర్ల పనులు వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఆదేశించారు. మంగళవారం తిరుపతిలోని తన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నెంపీ మాట్లాడుతూ వాకాడు మండలం, పూడిరాయదొరువు, తడ మండలం, ఇరకం, నాగలాపురం మండలం, నందనం గ్రామాల్లో నిర్మిస్తున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పూడిరాయదొరువు, ఇరకం గ్రామాల్లోని పనులకు వైల్డ్ లైఫ్ నుంచి అనుమతులు రావాలని.. నాగలాపురం మండలం, నందనంలో పనులు చేపట్టామని అధికారులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. రెండు టవర్లకు సంబంధించి వైల్డ్ లైఫ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ 3జీ టవర్ల నుంచి 4జీ టవర్లుగా మార్చే ప్రక్రియలో మొదటగా తిరుపతిని ఎంపిక చేశారని.. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. తిరుపతి పట్టణాన్ని 'జడ్' కేటగిరి నుంచి 'వై' కేటగిరికి మార్పు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోకరంగా ఉంటుందని ఇందుకు సంబంధిత అధికారులతో మాట్లాడానని ఎంపీ వివరించారు.

ఎస్వీసీసీలో రేపు జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాకు అపోలో ఫార్మశీకి చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థులు అర్హులని, మరిన్ని వివరాలకు 9154695289, 8977011128 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పరిశ్రమల్లో భద్రాత చర్యలపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఏ కేటగిరి కింద 12, బీ1 కింద 59, బీ2 కింద 48 పరిశ్రమలు ఉన్నాయని, వాటిని తరచూ పరిశీలిస్తున్నామని పరిశ్రమల విభాగం జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణా రెడ్డి వివరించారు. తిరుపతి జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ చంద్రశేఖర్, జడ్.ఎం, ఏపీఐఐసీ స్పెషల్ జోన్ విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 28,572 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సన్నిధిలో ఉద్యోగాలు

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి సన్నిధి.. ఇతర ఆలయాల్లో పొరుగుసేవల ప్రాతిపదికన పోటు విభాగాలలో లడ్డూ, అన్న ప్రసాదాల తయారీ కోసం అర్హులైన వైష్ణవ బ్రాహ్మణుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సీఈఓ వైవీకే.షణ్ముఖ్‌కుమార్ తెలిపారు. ఈనెల 17న తిరుపతి అలిపిరిలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మధ్యాహ్నం ఒంటి గంటలోపు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు కార్పొరేషన్ వెబ్ సైట్ http://slsmpc.in/ ను సంప్రదించాలని కోరారు.


సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ జులై 31, 2024

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు

రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు


మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో జొన్నగడ్డల సాయిపద్మా (22) తీవ్రంగా గాయపడిన ఘటన ఎస్ఎం అగ్రహారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసు కథనం... గుంటూరు జిల్లా, మంగళగిరి ప్రాంతానికి చెందిన సాయిపద్మా సోమరాత్రి విధుల కోసం కంపెనీకి వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి బైక్‌పై బయలుదేరింది. ఈ క్రమంలో ఎస్ఎం అగ్రహారానికి వచ్చే సరికి బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో యువతి తీవ్రంగా గాయపడింది. స్వర్ణాటోల్‌వే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. ఈ యువతి మంగళగిరి నుంచి బైక్‌పై ఇంత దూరం ఎందుకు వచ్చిందని పోలీసులు ఆరాతీస్తున్నారు. యువతి అపస్మారకస్థితిలో ఉండడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు. స్థానిక ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాల్లో ఎరువులు


మాట్లాడుతున్న జిల్లా అధికారి ఎస్.లక్ష్మి

తిరుపతి అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రసాయనికి ఎరువుల వ్యాపారం చేయడానికి చేపట్టాల్సిన అంశాలను జిల్లా సహకార అధికారి ఎస్.లక్ష్మి వివరించారు. కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో ఉద్యోగులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎరువుల వ్యాపారం చేపట్టడానికి లైసెన్స్‌లు పొందే విధానాలు వివరించారు. అంతేకాకుండా మార్కెట్ కమిటీలో నిర్మిస్తున్న గోదాములు, పెట్రోల్ బంకులు, జన ఔషధి కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి చేపట్టాల్సిన అంశాలను తెలియజేశారు. మార్క్‌ఫెడ్ జిల్లా అధికారి పవన్, సహకార శాఖ అధికారులు ఎం.వెంకటరమణ, డీ.నాగభూషణం, బీ.శివశంకర్ నాయక్, పీఎస్.రవీంద్రనాథ్, పీ.పెంచలయ్య పాల్గొన్నారు.

కాటేసిన మహమ్మారి

- పాస్ మనోవికాస్ ఆశ్రమంలో డయేరియా విజృంభణ
- ఇద్దరు దివ్యాంగుల మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 12 మంది బాధితులకు తిరుపతి రుయాలో చికిత్స
- ఆశ్రమాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్
- అంతా అపరిశుభ్రతే!
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- చర్యలు తీసుకోవాలని ఏడీ శ్రీనివాస్‌కు ఆదేశం
- ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు



తిరుపతి రూరల్/ తిరుపతి తుడా : తిరుపతిలోని పాస్–మనోవికాస్(మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమం)లో డయేరియా కలకలం రేపింది. ఇద్దరి అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురంలోని ఈ ఆశ్రమంలో మొత్తం 72 మంది మానసిక దివ్యాంగులు ఆశ్రయం పొందుతున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరోచనాలతో 20 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. అయితే అక్కడే వారికి చికిత్స అందించారు. ఇందులో 16 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని సోమవారం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గణపతి(26), శేషాచలం(16) మృతి చెందారు. మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. రుయాలోనే మరో 12 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో మానస (18), గురమ్మ (20), సరిత (15), తేజ (19), చన్ హీరా (18), పావని (19), యోగిత (13), ఇమామ్ హుస్సేన్ (20), ఈశ్వర్‌రెడ్డి (42), అనిత (20), పాండు (20), సాయికిట్టు (20), హిమతేజ (20), దుర్గాప్రసాద్ (21) ఉన్నారు. అలాగే తీవ్ర అస్వస్థతకు గురైన ప్రదీప్ (20), తేజస్వి (25) స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

చర్యలకు సిఫార్సు

ఆశ్రమంలో డయేరియా ప్రబలి ఇద్దరు మృతి చెందినా పాస్–మనోవికాస్ ఆశ్రమం నిర్వాహకులు సమాచారం ఇవ్వకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలో తనిఖీలు ఎందుకు నిర్వహించలేదని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్‌ను నిలదీశారు. ఆశ్రమంలో అపరిశుభ్రత, డయేరియా ప్రబలడంపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని, నిర్లక్ష్యం ఉంటే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రటరీ బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



మృతులు శేషాచలం (ఫైల్) గణపతి (ఫైల్)

ఆశ్రమంలో తనిఖీలు

పాస్ మనో వికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో తాగునీరు, వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శించిన కలెక్టర్


తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్

రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ... రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది డయేరియా బాధితులలో ఇద్దరు మరణించడం బాధాకరమన్నారు. మరో ఇద్దరికి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించామన్నారు. మిగిలిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో మొత్తం 72 మంది ఆశ్రయం పొందుతున్నారని, ఆదివారం ఉదయం నుంచి కొంత మందికి వాంతులు, విరోచనాలు అవుతున్నాయని తెలిపారు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు కూడా డయేరియా బారిన పడకుండా వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు.


నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్


తిరుపతి రుయాలో డయేరియా బాధితులు



చికిత్స నిమిత్తం డయేరియా బాధితులను తిరుపతి రుయాకు తరలిస్తున్న సిబ్బంది

ఎర్ర స్మగ్లర్లను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్

- ఇద్దరి అరెస్ట్
- కారుతో పాటు రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం

చంద్రగిరి: శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అడ్డుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ వీ.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ మంగళవారం కళ్యాణీడ్యామ్ వైపు వెళ్లి శ్రీవారిమెట్టు సమీపంలో కూంబింగ్ చేపట్టారు. నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంత మంది వ్యక్తులు దిగడం గమనించిన అధికారులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుండగులు పారిపోయారు. దీంతో వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వీరు తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్ (29), రాజేంద్రన్ చిన్నపయ్యన్ (53)గా గుర్తించారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ అనే మేస్త్రీ తీసుకొచ్చినట్లు తెలిపారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన సెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్ కోసం గాలింపులు చేపట్టారు. అడవుల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వారి కోసం జల్లెడపట్టారు. అరెస్టయిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

గుక్కెడు నీళ్లివ్వండి సారూ!

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన

నాయుడుపేటటౌన్ : 'గుక్కెడు నీళ్లిచ్చి ఆదుకోండి సారూ..' అంటూ స్థానిక మహిళలు ఖాళీబిందెలు చేతబట్టి ఆందోళన బాట పట్టారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం బీడీ కాలనీ సమీప ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై పాలకులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారంటూ మహిళలు మంగళవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ పట్టణంలోని లోతువాని గుంట, ఎల్ఏ సాగరం పాత కొత్త బీడీ కాలనీలు తదితర ప్రాంతాల్లో తాగునీటి కొళాయిల్లో కలుషిత నీరు వస్తోందని, ఈ సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వవహిస్తున్నారని తెలిపారు. కేవలం తాగునీటి కోసం ఒక ట్యాంకర్‌ను పంపిస్తున్నారని, ఆ నీళ్లు కూడా తాగేందుకు పనికిరావడం లేదన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు ఖాళీ బిందెలతో స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాయ సమీపంలోని రహదారిపై బైఠాయించారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

భవిత విద్యార్థులు భేష్


దివ్యాంగ విద్యార్థినికి జ్ఞాపిక, సర్టిఫికెట్ అందిస్తున్న డీఈఓ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్: భవిత (సహిత విద్య) కేంద్రంలోని 28 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) డాక్టర్ వీ.శేఖర్ కొనియాడారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో సమానంగా భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలు ఉత్తీర్ణత సాధించారని, దీనికి సహకారం అందించిన సహిత విద్య ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. డీవైఈఓ కె.బాలాజీ, ఎంఈఓ బి.భాస్కర్‌నాయక్, ఎంజీఎం హెచ్‌ఎం మురుగన్, ఉయ్ సపోర్ట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహ సున్నీసా, వేమన విజాన కేంద్రం వ్యవస్థాపకులు పి.నాగార్జునరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి


మాట్లాడుతున్న ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆర్ఐఓ జీవీ. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. అన్ని ప్రైవేటు కళాశాలల్లో యూడైస్ వివరాలను వెంటనే నమోదు చేయాలని, ప్రతీ కళాశాలలో టీచింగ్ స్టాఫ్‌ను అర్హత ఉన్న వారినే నియమించుకోవాలని చెప్పారు. ఆదివారం రోజుల్లో తరగతులు నిర్వహిస్తే లక్ష రూపాయల అపరాధ రుసుముతో పాటు అనుమతి రద్దు చేయనున్నట్టు హెచ్చరించారు. గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిపుణులతో మోటివేషన్ తరగతులు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, అలాగే ప్రతి ఆదివారం విద్యార్థులకు యోగా, ధ్యానం తరగతులు నిర్వహించాలని, వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వాటి వివరాలను ఆర్ఐఓ మెయిల్‌కు పంపించాలని పేర్కొన్నారు. వీటన్నింటినీ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తప్పక పాటించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

'సెల్ఫ్'కు చరమగీతం!

- ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మూడు కోర్సులకు మంగళం
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సీఎస్ఈ, ఈసీఈ కోర్సులు ఎత్తివేత
- 2024–25 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ వెబ్ఆప్షన్లలో కనిపించని వైనం
- ఇప్పటికే బీకాం జనరల్ డిగ్రీని ఎత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న కోర్సులను ఎత్తివేయడం దారుణం
- మండి పడుతున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెల కూడా కాకముందే అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిపురాతన, పేద విద్యార్థుల ఆశాజ్యోతి బీకాం జనరల్ డిగ్రీని పూర్తిగా ఎత్తివేసింది. అదే దారిలో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మూడు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు చరమగీతం పాడింది. ఆధునిక సమాజంలో ఎంతో ప్రాచుర్యం ఉండి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు మంగళం పాడింది.

వెబ్ఆప్షన్లలో కనబడని కోర్సులు

2024–25 విద్యా సంవత్సరానికి ఏపీ ఈఏ ఎమ్‌సెట్ చేపట్టిన ఆన్‌లైన్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఆప్షన్లు కనిపించలేదు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఈ కోర్సులలో చేరేందుకు ఎంతో ఆశతో ఉన్న విద్యార్థులకు నిరాశే ఎదురైంది. వెబ్ ఆప్షన్లలో కేవలం సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ మాత్రమే ఉండడంతో విద్యార్థులు అవాక్కయ్యారు.

ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసే కుట్ర

ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించేందుకు నూతన ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనం

ఎస్వీయూ వర్సిటీ పరిధిలోని ఏకైక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను సైతం వెబ్ఆప్షన్స్‌లో పెట్టకుండా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లుగా కొనసాగిన కోర్సులను ఏకపక్షంగా తొలగించి ప్రైవేటు కళాశాలలో సీట్లు పెంచారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం తీరుచూస్తే కార్పొరేట్ ప్రభుతాన్ని తలపిస్తోందని, త్వరలో విద్యార్థుల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

ఆప్షన్ పెట్టాలని వచ్చాం

ఎస్వీయూలో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుగా ఉన్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు వెబ్ ఆప్షన్ పెట్టాలని నెట్ సెంటర్‌కు వచ్చాం. ఇక్కడ చూశాక వెబ్ఆప్షన్స్‌లో ఎస్వీయూలో ఏఐ కోర్సు కనబడలేదు. ఇంటర్నెట్ స్లోగా ఉందేమోనని మరో సెంటర్‌కు వెళ్లి చూడగా అక్కడా ఇదే పరిస్థితి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎస్వీయూలో ఎత్తివేశారని తెలిసింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో లక్షల్లో ఫీజులు అడుగుతున్నారు. నూతన ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత లేనట్టు కనబడుతోంది.

–సుశీల, విద్యార్థి తల్లి, కొర్లగుంట, తిరుపతి

గంజాయి బ్యాచ్ వీరంగం

- మంగళంలో ప్రైవేటు విద్యాసంస్థ బస్సుపై రాళ్లతో దాడి
- భయాందోళనకు గురైన విద్యార్థినులు
- గంజాయి బ్యాచ్‌ని అదుపులోకి తీసుకున్న తిరుచానూరు పోలీసులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని మంగళంలో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మంగళవారం సాయంత్రం రోడ్లపై అడ్డుగా నిలిచి బీభత్సం సృష్టించారు. ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్సుపై రాళ్ల దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. స్థానికులు, తిరుచానూరు పోలీసుల కథనం.. ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్సు కళాశాలలో విద్యార్థినులను తీసుకొని రూట్ పై వారి ఇళ్ల వద్ద వదిలేందుకు మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైన్ వద్దకు చేరింది. అక్కడ పూర్తిగా గంజాయి మత్తులో ఉన్న బీటీఆర్ కాలనీకి చెందిన బాలు, మహేష్ బస్సుకు అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ మోగించాడు. దీన్ని తప్పుబడుతూ సమీపంలోని రాళ్లు తీసుకొని బస్సు అద్దాలపై విసిరారు. ఈ ఘటనతో బస్సులోని బాలికలు ఒక్కసారిగా భయాందోళనకు గురై అరుపులు, కేకలు పెట్టారు. బస్సు డ్రైవర్ కుమార్‌ను తన సీటు నుంచి కిందకు లాగి చితకొట్టారు. సమాచారం అందుకున్న వెంటనే తిరుచానూరు మంగళం అవుట్ పోస్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చెదరగొట్టారు. బస్సులో ఉన్న 25 మంది బాలికలను వాళ్ల తల్లిదండ్రులతో మాట్లాడి క్షేమంగా ఇళ్లకు పంపించారు. అనంతరం గంజాయి మత్తులో విర్రవీగిన యువకులను, బస్సును తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యువకుల దాడిలో కళాశాల బస్సు అద్దాలు ధ్వంసం


పోలీసుల అదుపులో గంజాయి సేవించిన బాలు, మహేష్



ఎర్రస్మగ్లర్లను అడ్డుకున్న ..
శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకున్నారు. - 8లో



కాటేసిన మహమ్మారి!
డయేరియా కాటేసింది. ఇద్దరు మానసిక వికలాంగులను పొట్టనబెట్టుకున్న ఘటన విషాదాన్ని మిగిల్చింది. - 8లో



భవిత విద్యార్థులు భేష్
పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో సత్తాచాటిన భవిత విద్యార్థుల ప్రతిభను డీఈఓ వీ.శేఖర్ కొనియాడారు. - 8లో

అసలే గద్దలు. ఆ గద్దలకు 'అధికార' రాబందు తోడయ్యింది. ఇంకేముంది. అన్నీ కలిసి ఆధ్యాత్మిక నగరంపై వాలిపోయాయి. కళ్లు మూసి తెరిచేలోపు రూ.100 కోట్ల విలువ చేసే దేవుడి మాన్యాన్ని అమాంతం మింగేశాయి. అభ్యంతరం చెప్పిన దేవదాయశాఖ సిబ్బందిపై దాడులకు తెగబడ్డాయి. బట్టలు విప్పి, మోకాళ్లపై కూర్చోబెట్టారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నానాబూతులు తిట్టి నిర్బంధించారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నాయన్నా 'డోంట్ కేర్' అంటూ వారి ఎదుటే... దేవుడి మాన్యానికి దర్జాగా కాంపౌండ్ వేశారు. ఇళ్ల స్థలాల కింద బహిరంగ మార్కెట్లో బేరం పెట్టేశారు. పోలీస్ స్టేషన్లో పంచాయితీ పెట్టిన దేవదాయ శాఖ అధికారులను పోలీసుల ఎదుటే కొట్టబోయారు. 'నోరు మెదిపితే భూమ్మీద నూకలు చెల్లిపోతాయి'అంటూ బెదిరించారు. ఇదంతా ఎక్కడో మారుమూలున్న కొండల్లోనో గుట్టల్లోనో జరగలేదు. తిరుపతి నగర నడిబొడ్డున అందరూ చూస్తుండగానే జరిగిన సంఘటన ఇది.

తిరుపతిలో ల్యాండ్ మాఫియా

నాని.. ఆక్రమించుకున్న దేవుడి మాన్యం ఇదే



- రూ.100 కోట్ల భూమి హాంఫట్
- కొనసాగుతున్న నాని ఆక్రమణల పర్వం
- 'నాని ఖాతా'లోకి మరో 3 ఎకరాలు
- మరో నాలుగు ఎకరాలపై కన్ను
- చిత్తూరులో మధ్యస్తంతో చంద్రగిరి ఎమ్మెల్యేకి రూ.52 కోట్లు
- దేవదాయ శాఖ సిబ్బంది బట్టలిప్పి మోకాళ్లపై కూర్చోబెట్టిన 'చిత్తూరు గ్యాంగ్'
- ప్రాణభయంతో పోలీసులకు దేవదాయశాఖ ఫిర్యాదు
- అధికార పార్టీ నేతల తీరుపై సర్వత్రా విమర్శలు, ఆందోళనలకు సిద్ధం

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి నగరంతోపాటు దేశంలోని చాలా రాష్ట్రాల్లో హథీరాంజీ మఠం భూములు ఉన్నాయి. వీటిని దేవుడి మాన్యం భూములుగా పరిగణిస్తారు. ఈ భూముల విషయమై తరచూ వివాదాలు నడుస్తుంటాయి. అలాగే తిరుపతి నడిబొడ్డున అటు అవిలాల, లింగేశ్వరనగర్, ఇటు బైరాగిపట్టెడ ప్రాంతాల నడుమ 145, 147/1 సర్వే నంబర్లలో 10 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో మూడో వంతు భూమి హథీరాంజీ మఠం భూమి, నాలుగోవంతు భూమి పరకాల మఠం భూమి. దీనికి సంబంధించి అనేక డాక్యుమెంట్లు కూడా ఉన్నాయి. ఈ భూమి విలువ కనీసం రూ.100 కోట్లకుపైమాటే. ఆ భూమి తమదంటూ ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డి అనే వ్యక్తులు దానిని స్వాధీనం చేసుకోవడానికి తీవ్రంగా యత్నిస్తున్నారు. హథీరాంజీ మఠం ఆధీనంలో ఉన్న ఆ భూమిపై కోర్టులో వ్యాజ్యాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో గత ప్రభుత్వంలోని అధికార పెద్దలెవ్వరూ వారికి సహకరించలేదు. దీంతో వారి ఆటలు సాగలేదు. సరిగ్గా నెల కిందట ప్రభుత్వం మారింది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పులివర్తి నాని ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇక ఎంకే.నాయుడు, సేతుమాధవ్, నరసింహారెడ్డికి రెక్కలొచ్చాయి. 'మాఫియా' తమకు అండగా 'చిత్తూరు గ్యాంగ్'ను అప్పటికే రంగంలోకి దింపింది. ఎలాగైనా ఆ భూమి స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు మొదలు పెట్టారు.

స్థానికులకు, పోలీసులకు చెరో రూ.50 లక్షలు

స్థానికంగా మూడు పంచాయతీల నుంచి అభ్యంతరం వ్యక్తం కావడంతో 50 మందిని భయపెట్టి తలకు రూ.లక్ష చొప్పున ఇచ్చి నోరు మూయించారు. అదే సమయంలో పోలీసులు సహకరించేందుకు రూ.50 లక్షలు ముట్టజెప్పినట్లు సమాచారం.

మరో నాలుగు ఎకరాలపై కన్ను

ఈ భూమికి ఎదురుగానే మరో నాలుగు ఎకరాల హథీరాంజీ భూమి ఉంది. ఇందులో కంపచెట్లు నిండుగా ఉన్నాయి. వాటిని తొలగించి దానిని కూడా ఆక్రమించడానికి ల్యాండ్ మాఫియా సిద్ధమైపోతోంది. ఈ మేరకు ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నానీ పలువురికి తన తడాకా చూపించారు. తిరుపతి రూరల్‌లోని ఓ రైస్ మిల్లు మూయించకుండా ఉండడానికి రూ.2 కోట్లు ఇవ్వాలని బెదిరించారు. అతను రూ.50 లక్షలు ఇస్తామన్నా వినకుండా రైస్‌మిల్లుని మూయించారు. టీటీడీ కాంట్రాక్టరును బెదిరించి రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని రాయించుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో మూడు ఎకరాల స్వాధీనం చేసుకున్నారు. ఇంకో నాలుగు ఎకరాలకు స్కెచ్ వేశారు. ఈ వ్యవహారాలను తిరుపతిలో 'చిత్తూరు గ్యాంగ్' సహకారంతో తన ఆక్రమణల పరంపరను నాని కొనసాగిస్తున్నారు.

పోలీస్ స్టేషన్‌లోనూ రెచ్చిపోయిన 'మాఫియా'

చూస్తూ.. చూస్తూ అంత విలువైన భూమి దురాక్రమణకు గురికాకుండా చూడాలనే ఉద్దేశంతో మఠం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పైగా తమకు ఆ 'మాఫియా' వలన ప్రాణాపాయం ఉందని, తమను నిర్బంధించి మోకాళ్లపై నిల్చోబెట్టారని జరిగిన తతంగాన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై చంద్రగిరి డీఎస్పీ జూన్ 11న 'మాఫియా' సభ్యులను, దేవదాయ శాఖ అధికారులను అక్కడకు పిలిపించుకున్నారు. మాఫియా సభ్యులు అక్కడ కూడా దేవదాయ శాఖ అధికారులపై తిట్ల పురాణం అందుకున్నారు. ఓ దశలో అధికారులపై దాడి చేయబోయారు. 'ప్రభుత్వం మాది, ఎమ్మెల్యే మా నాని అన్న', 'మేము చెప్పిందే జరుగుతుంది, జరగాలి' 'ఆ భూమి మాది, దేవుడి మాన్యం, మఠం భూములంటే తంతాం.. నీ దిక్కున్న చోట చెప్పుకో... కాదంటే నీవు ఎక్కడ పని చేస్తావో మేమూ చూస్తాం.' అంటూ అధికారులపై మరళా విరుచుకుపడ్డారు. ఇదంతా పోలీసుల ఎదుటే జరిగింది. 'మాఫియా', 'చిత్తూరు గ్యాంగ్'పై దేవదాయ శాఖ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటి వరకూ అతీగతీ లేదు. కనీసం ఎఫ్ఐఆర్ కట్టలేదు. ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు.

ఒకే డీల్.. నానికి రూ.52 కోట్లు

ఒప్పందంలో భాగంగా ఉచితంగా తీసుకున్న మూడెకరాలకు రూ.30 కోట్లు, అభివృద్ధి కింద తీసుకున్న ఏడెకరాల్లో తన వాటా కింద రూ.22 కోట్లు.. మొత్తం ఒకే డీల్‌తో నాని ఖాతాల్లోకి రూ.52 కోట్లు జమచేసుకోనున్నారు. పులివెందులకు చెందిన నవీన్ అనే వ్యక్తిని భాగస్వామిగా చేర్చుకుని ఆ భూమిని పక్కా ప్రణాళికతో ప్రహరీలోపల గుట్టుచప్పుడు కాకుండా పాట్లు వేసి అమ్మేస్తున్నారు. అంకణం స్థలం రూ.1.5 లక్షల చొప్పున విక్రయిస్తున్నారు. అధికారపార్టీ నేతల దౌర్జన్యాలను చూస్తున్న స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇందుకేనా టీడీపీకి ఓటేసిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. దేవుని భూములను కూడా వదలరా? అంటూ మండిపడుతున్నారు. తిరుపతి నడిబొడ్డున ఇంత దురాక్రమణ జరుగుతుంటే కూటమిలోని పార్టీలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీలు ఏం చేస్తున్నాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలా దౌర్జన్యాలు, ఆక్రమణలు కొనసాగితే ఆందోళనలకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

పనులు ప్రారంభం

జూన్ 9 తేదీన ఉదయం 7 గంటలకు ఆ భూమి చుట్టూ ప్రహరీ గోడ వేయడానికి పనులు ప్రారంభించారు. ఆలస్యంగా సమాచారం అందుకున్న దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది అందరూ కలిసి అదే నెల 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఓ ఆరుగురు ఆ స్థలం వద్దకెళ్లి ప్రహరీ నిర్మించడానికి వీల్లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ 100 మందికిపైగా చిత్తూరు గూండాలు కాపుకాస్తున్నారు. 'మేమెవరో తెలియదా?, ఎంత ధైర్యం ఉంటే ఇక్కడికి వస్తావ్?, నాని అన్న అంటే భయం లేదా?, మేము మీకు ప్రత్యేకంగా బొట్టు పెట్టి చెప్పాలా? ఎలా వచ్చారో? అలాగే ... మూసుకుని వెళ్లండి' అంటూ బెదిరింపులకు దిగారు. అయినా మఠం అధికారులు కుదరదు, ఇది మఠం భూమి.. పనులు ఆపాల్సిందేనంటూ గట్టిగా వాదించారు. కోపోద్రిక్తులైన చిత్తూరు గ్యాంగ్ మఠం సిబ్బందిని తాత్కాలికంగా నిర్మించుకున్న గదిలోకి తీసుకెళ్లి బట్టలు ఊడదీయించారు. అధికారులతో గోడ కుర్చీ వేయించారు. నోటికొచ్చినట్లు బండ బూతులు తిట్టారు. సుమారు మూడు గంటల పాటు ప్రాణభయంతో అక్కడే బిక్కుబిక్కుమంటూ గడిపారు. చివరకు చిత్తూరు గ్యాంగ్ కాళ్లావేళ్లా పడి బతుకుజీవుడా అంటూ అక్కడి నుంచి మఠం కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ జరిగిన విషయాలను మఠం పరిపాలనాధికారికి వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఈ తతంగమంతా ఎమ్మార్ పల్లె పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో చోటు చేసుకుంది. ఇంత జరుగుతున్నా పోలీసులు తమను కాపాడలేదని కన్నీరుపెట్టుకున్నారు.



ఆక్రమిత స్థలంలో దర్జాగా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్

నాకు మూడు, మీకు ఏడెకరాలు.. ఇదీ నాని ఫిక్సింగ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాని రంగంలోకి దిగారు. ఎంకే నాయుడు, నరసింహారెడ్డి, సేతమాధవ్‌ని ఆ నాయకుడు చిత్తూరుకి పిలిపించారు. తనకు మూడెకరాలు కేటాయిస్తే, ముగ్గురికి ఏడెకరాలు తీసుకోమని హుకుం జారీ చేశారు. ఈ భూమికి సంబంధించి మఠం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఇబ్బందీ రాకుండా తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగని చంద్రగిరి ఎమ్మెల్యే నాని.. ఆ ఏడెకరాలను తానే కొనుగోలు చేసుకుంటానని చెప్పడంతో ఆ ముగ్గురు షాక్ అయ్యారు. ఆ ఏడెకరాలకు రూ.25 కోట్లు చెల్లిస్తానని, ఆ నగదుని ముగ్గురు పంచుకోమని స్పష్టం చేశారు. చేసేదేమీ లేక ముగ్గురూ తెల్లముఖం వేశారు. ఒక్కదెబ్బతో పదెకరాల నుంచి అధికారపార్టీ నేతకు రూ.52 కోట్లు రాబట్టుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. ఈ మొత్తంలో అమరావతిలోని మరో ముఖ్యనేత వాటా ఇవ్వాలని చెప్పుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

న్యూస్‌రీల్

కల్తీ మద్యం తయారీపై కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు

తిరుపతి అర్బన్: కల్తీ మద్యం తయారీపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ, సెబ్ అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మద్యం దుకాణాలను తరచూ తనిఖీలు చేయాలన్నారు. అక్రమాలకు తావులేకుండా అడ్డుకట్టవేయాలని పేర్కొన్నారు. అక్రమ రవాణాతోపాటు అక్రమ నిల్వలు, సారా అమ్మకాలు ఒక్క శాతం కూడా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి జానకీరామ్ మాట్లాడుతూ జిల్లాలో తిరుపతి డిపో నుంచి 148 దుకాణాలకు, ఓజిలి డిపో నుంచి 95 దుకాణాలకు, లైసెన్స్ పొందిన బార్లుకు 24 వాహనాల ద్వారా మద్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 240 దుకాణాలపై నిత్యం నిఘాపెట్టినట్లు వెల్లడించారు. రేణిగుంట మండలం గాజులమద్యం వద్ద ఎస్వీఆర్ డిస్టిలరీ(మ్యాన్‌ఫ్యాక్చరింగ్) వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజేంద్ర మాట్లాడుతూ జిల్లాలో 2023లో 102, 2024 జూలై 8 వరకు 950 కేసులు, మొత్తం 1052 కేసులను డీపీఎల్ కింద బుక్ చేసినట్లు వివరించారు. సమావేశంలో ఓజిలి డిపో మేనేజర్ నాగమల్లేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ విమలకుమారి

తిరుపతి క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమని, దాన్ని అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని క్రైమ్ ఎస్పీ విమలకుమారి స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ సెనేట్ హాల్లో సంయుక్త ధూమపాన నిషేధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొగాకు నమిలి తినడం వల్ల, సిగరెట్ తాగడం వల్ల, గుట్కా పాన్ పరాగ్ తినడం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. కూలి పని చేసుకునే పేదవాళ్లు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలేజీలు, స్కూళ్లకు సుమారు 100 మీటర్ల దూరంలో మత్తు పదార్థాలు విక్రయించే షాపులు ఉండకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్సీడీ అధికారి పద్మావతి, డీఈఓ శేఖర్, సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

త్వరితగతిన బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణం



బీఎస్ఎన్ఎల్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి(అలిపిరి): పెండింగ్‌లోని బీఎస్ఎన్ఎల్ టవర్ల పనులు వేగవంతం చేయాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఆదేశించారు. మంగళవారం తిరుపతిలోని తన కార్యాలయంలో బీఎస్ఎన్ఎల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా నెంపీ మాట్లాడుతూ వాకాడు మండలం, పూడిరాయదొరువు, తడ మండలం, ఇరకం, నాగలాపురం మండలం, నందనం గ్రామాల్లో నిర్మిస్తున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పూడిరాయదొరువు, ఇరకం గ్రామాల్లోని పనులకు వైల్డ్ లైఫ్ నుంచి అనుమతులు రావాలని.. నాగలాపురం మండలం , నందనంలో పనులు చేపట్టామని అధికారులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. రెండు టవర్లకు సంబంధించి వైల్డ్ లైఫ్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వదేశీ సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తూ ఆత్మనిర్బర్ భారత్ కార్యక్రమంలో భాగంగా బీఎస్ఎన్ఎల్ 3జీ టవర్ల నుంచి 4జీ టవర్లుగా మార్చే ప్రక్రియలో మొదటగా తిరుపతిని ఎంపిక చేశారని.. త్వరలో ఈ పనులు ప్రారంభమవుతాయని వివరించారు. తిరుపతి పట్టణాన్ని 'జడ్' కేటగిరి నుంచి 'వై' కేటగిరికి మార్పు చేసినట్లయితే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోకరంగా ఉంటుందని ఇందుకు సంబంధిత అధికారులతో మాట్లాడానని ఎంపీ వివరించారు.

ఎస్వీసీసీలో రేపు జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బాలజీ కాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాకు అపోలో ఫార్మసీకి చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్థతలు అర్హులని, మరిన్ని వివరాలకు 9154695289, 8977011128 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి

తిరుపతి అర్బన్: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పరిశ్రమల్లో భద్రాత చర్యలపై ఆయన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఏ కేటగిరి కింద 12, బీ1 కింద 59, బీ2 కింద 48 పరిశ్రమలు ఉన్నాయని, వాటిని తరచూ పరిశీలిస్తున్నామని పరిశ్రమల విభాగం జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణా రెడ్డి వివరించారు. తిరుపతి జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ చంద్రశేఖర్, జడ్ ఎం, ఏపీఐఐసీ స్పెషల్ జోన్ విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 28,572 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సన్నిధిలో ఉద్యోగాలు

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి సన్నిధి.. ఇతర ఆలయాల్లో పొరుగుసేవల ప్రాతిపదికన పోటు విభాగాలలో లడ్డూ, అన్న ప్రసాదాల తయారీ కోసం అర్హులైన వైష్ణవ బ్రాహ్మణుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ సీఈఓ వైవీకే.షణ్ముఖ్‌కుమార్ తెలిపారు. ఈనెల 17న తిరుపతి అలిపిరిలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మధ్యాహ్నం ఒంటి గంటలోపు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు కార్పొరేషన్ వెబ్ సైట్ http://slsmpc.in/ ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు



మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

దొరవారిసత్రం: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఘటనలో జొన్నగడ్డల సాయిపద్మా (22) తీవ్రంగా గాయపడిన ఘటన ఎన్ఎం అగ్రహారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసు కథనం... గుంటూరు జిల్లా, మంగళగిరి ప్రాంతానికి చెందిన సాయిపద్మా సోమరాత్రి విధుల కోసం కంపెనీకి వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి బైక్‌పై బయలుదేరింది. ఈ క్రమంలో ఎన్ఎం అగ్రహారానికి వచ్చే సరికి బైక్ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో యువతి తీవ్రంగా గాయపడింది. స్వర్ణాటోల్‌వే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చెన్నైకి తరలించారు. ఈ యువతి మంగళగిరి నుంచి బైక్‌పై ఇంత దూరం ఎందుకు వచ్చిందని పోలీసులు ఆరాతీస్తున్నారు. యువతి అపస్మారకస్థితిలో ఉండడంతో పూర్తి వివరాలు తెలియరాలేదు. స్థానిక ఎస్ఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహకార సంఘాల్లో ఎరువులు



మాట్లాడుతున్న జిల్లా అధికారి ఎస్.లక్ష్మి

తిరుపతి అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రసాయనిక ఎరువుల వ్యాపారం చేయడానికి చేపట్టాల్సిన అంశాలను జిల్లా సహకార అధికారి ఎస్.లక్ష్మి వివరించారు. కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో ఉద్యోగులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఎరువుల వ్యాపారం చేపట్టడానికి లైసెన్స్‌లు పొందే విధానాలు వివరించారు. అంతేకాకుండా మార్కెట్ కమిటీలో నిర్మిస్తున్న గోదాములు, పెట్రోల్ బంకులు, జన ఔషధి కేంద్రాల పనితీరును మెరుగుపరచడానికి చేపట్టాల్సిన అంశాలను తెలియజేశారు. మార్కెఫెడ్ జిల్లా అధికారి పవన్, సహకార శాఖ అధికారులు ఎం.వెంకటరమణ, డీ.నాగభూషణం, బీ.శివశంకర్ నాయక్, పీఎస్.రవీంద్రనాథ్, పీ.పెంచలయ్య పాల్గొన్నారు.

కాటేసిన మహమ్మారి

- పాస్ మనోవికాస్ ఆశ్రమంలో డయేరియా విజృంభణ
- ఇద్దరు దివ్యాంగుల మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 12 మంది బాధితులకు తిరుపతి రుయాలో చికిత్స
- ఆశ్రమాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటేశ్వర్
- అంతా అపరిశుభ్రతే!
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- చర్యలు తీసుకోవాలని ఏడీ శ్రీనివాస్‌కు ఆదేశం
- ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు



తిరుపతి రూరల్/ తిరుపతి తుడా : తిరుపతిలోని పాస్–మనోవికాస్(మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమం)లో డయేరియా కలకలం రేపింది. ఇద్దరి అమాయకుల ప్రాణాలను బలితీసుకుంది. తిరుపతి రూరల్ మండలం, పద్మావతిపురంలోని ఈ ఆశ్రమంలో మొత్తం 72 మంది మానసిక దివ్యాంగులు ఆశ్రయం పొందుతున్నారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరోచనాలతో 20 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. అయితే అక్కడే వారికి చికిత్స అందించారు. ఇందులో 16 మంది తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వారిని సోమవారం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గణపతి(26), శేషాచలం(16) మృతి చెందారు. మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. రుయాలోనే మరో 12 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో మానస (18), గురమ్మ (20), సరిత (15), తేజ (19), చన్ హీరా (18), పావని (19), యోగిత (13), ఇమామ్ హుస్సేన్ (20), ఈశ్వర్‌రెడ్డి (42), అనిత (20), పాండు (20), సాయికిట్టు (20), హిమతేజ (20), దుర్గాప్రసాద్ (21) ఉన్నారు. అలాగే తీవ్ర అస్వస్థతకు గురైన ప్రదీప్ (20), తేజస్వి (25) స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

చర్యలకు సిఫార్సు

ఆశ్రమంలో డయేరియా ప్రబలి ఇద్దరు మృతి చెందినా పాస్–మనోవికాస్ ఆశ్రమం నిర్వాహకులు సమాచారం ఇవ్వకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలో తనిఖీలు ఎందుకు నిర్వహించలేదని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాస్‌ను నిలదీశారు. ఆశ్రమంలో అపరిశుభ్రత, డయేరియా ప్రబలడంపై పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలని, నిర్లక్ష్యం ఉంటే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి ఆర్డీవో నిశాంత్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఆశ్రమ పాఠశాల జనరల్ సెక్రటరీ బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ మురళీకృష్ణ పాల్గొన్నారు.




మృతులు శేషాచలం (ఫైల్) గణపతి (ఫైల్)

ఆశ్రమంలో తనిఖీలు

పాస్ మనో వికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో తాగునీరు, వంటగదిని, పరిసరాలను పరిశీలించారు. అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బాధితులను పరామర్శించిన కలెక్టర్



తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జిల్లా కలెక్టర్

రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ... రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 16 మంది డయేరియా బాధితులలో ఇద్దరు మరణించడం బాధాకరమన్నారు. మరో ఇద్దరికి మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించామన్నారు. మిగిలిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో మొత్తం 72 మంది ఆశ్రయం పొందుతున్నారని, ఆదివారం ఉదయం నుంచి కొంత మందికి వాంతులు, విరోచనాలు అవుతున్నాయని తెలిపారు. ఆశ్రమంలో ఉన్న మిగిలిన పిల్లలు కూడా డయేరియా బారిన పడకుండా వారికి ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి రుయాలో డయేరియా బాధితులు




చికిత్స నిమిత్తం డయేరియా బాధితులను తిరుపతి రుయాకు తరలిస్తున్న సిబ్బంది

ఎర్ర స్మగ్లర్లను అడ్డుకున్న టాస్క్‌ఫోర్స్

- ఇద్దరి అరెస్ట్
- కారుతో పాటు రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం

చంద్రగిరి: శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్ ఫోర్సు పోలీసులు అడ్డుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్‌చార్జ్, తిరుపతి జిల్లా ఎస్పీ వీ.హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ మంగళవారం కళ్యాణీడ్యామ్ వైపు వెళ్లి శ్రీవారిమెట్టు సమీపంలో కూంబింగ్ చేపట్టారు. నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంత మంది వ్యక్తులు దిగడం గమనించిన అధికారులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా దుండగులు పారిపోయారు. దీంతో వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వీరు తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్ (29), రాజేంద్రన్ చిన్నపయ్యన్ (53)గా గుర్తించారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ అనే మేస్త్రీ తీసుకొచ్చినట్లు తెలిపారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన సెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్ కోసం గాలింపులు చేపట్టారు. అడవుల్లోని అన్ని ప్రాంతాల్లోనూ వారి కోసం జల్లెడపట్టారు. అరెస్టయిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు.

గుక్కెడు నీళ్లివ్వండి సారూ!

- ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నాయుడుపేటటౌన్ : 'గుక్కెడు నీళ్లిచ్చి ఆదుకోండి సారూ..' అంటూ స్థానిక మహిళలు ఖాళీబిందెలు చేతబట్టి ఆందోళన బాట పట్టారు. పట్టణంలోని ఎల్ఏ సాగరం బీడీ కాలనీ సమీప ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీనిపై పాలకులు, సంబంధిత అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారంటూ మహిళలు మంగళవారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ పట్టణంలోని లోతువాని గుంట, ఎల్ఏ సాగరం పాత కొత్త బీడీ కాలనీలు తదితర ప్రాంతాల్లో తాగునీటి కొళాయిల్లో కలుషిత నీరు వస్తోందని, ఈ సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. కేవలం తాగునీటి కోసం ఒక ట్యాంకర్‌ను పంపిస్తున్నారని, ఆ నీళ్లు కూడా తాగేందుకు పనికిరావడం లేదన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ మేరకు ఖాళీ బిందెలతో స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాయ సమీపంలోని రహదారిపై బైఠాయించారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. తాగునీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు.

భవిత విద్యార్థులు భేష్



దివ్యాంగ విద్యార్థినికి జ్ఞాపిక, సర్టిఫికెట్ అందిస్తున్న డీఈఓ శేఖర్

తిరుపతి ఎడ్యుకేషన్: భవిత (సహిత విద్య) కేంద్రంలోని 28 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) డాక్టర్ వీ.శేఖర్ కొనియాడారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన సభకు డీఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ విద్యార్థులతో సమానంగా భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లలు ఉత్తీర్ణత సాధించారని, దీనికి సహకారం అందించిన సహిత విద్య ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించారు. డీవైఈఓ కె.బాలాజీ, ఎంఈఓ బి.భాస్కర్‌నాయక్, ఎంజీఎం హెచ్ఎం మురుగన్, ఉయ్ సపోర్ట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహ సున్నీసా, వేమన విజ్ఞాన కేంద్రం వ్యవస్థాపకులు పి.నాగార్జునరెడ్డి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆర్ఐఓ జీవీ. ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో మంగళవారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. అన్ని ప్రైవేటు కళాశాలల్లో యూడైస్ వివరాలను వెంటనే నమోదు చేయాలని, ప్రతి కళాశాలలో టీచింగ్ స్టాఫ్‌ను అర్హత ఉన్న వారినే నియమించుకోవాలని చెప్పారు. ఆదివారం రోజుల్లో తరగతులు నిర్వహిస్తే లక్ష రూపాయల అపరాధ రుసుముతో పాటు అనుమతి రద్దు చేయనున్నట్టు హెచ్చరించారు. గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా నిపుణులతో మోటివేషన్ తరగతులు, అవగాహన సదస్సులు నిర్వహించాలని, అలాగే ప్రతి ఆదివారం విద్యార్థులకు యోగా, ధ్యానం తరగతులు నిర్వహించాలని, వీటన్నింటికీ సంబంధించిన ఫొటోలు, వాటి వివరాలను ఆర్ఐఓ మెయిల్‌కు పంపించాలని పేర్కొన్నారు. వీటన్నింటినీ ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు తప్పక పాటించాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

'సెల్ఫ్'కు చరమగీతం!

- ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మూడు కోర్సులకు మంగళం
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సీఎస్ఈ, ఈసీఈ కోర్సులు ఎత్తివేత
- 2024-25 ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ వెబ్‌ఆప్షన్లలో కనిపించని వైనం
- ఇప్పటికే బీకాం జనరల్ డిగ్రీని ఎత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న కోర్సులను ఎత్తివేయడం దారుణం
- మండి పడుతున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ: నూతన ప్రభుత్వం ఏర్పడి పట్టుమని నెల కూడా కాకముందే అనాలోచిత నిర్ణయాలతో విద్యావ్యవస్థను అస్తవ్యస్తం చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిపురాతన, పేద విద్యార్థుల ఆశాజ్యోతి బీకాం జనరల్ డిగ్రీని పూర్తిగా ఎత్తివేసింది. అదే దారిలో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మూడు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు చరమగీతం పాడింది. ఆధునిక సమాజంలో ఎంతో ప్రాచుర్యం ఉండి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు మంగళం పాడింది.

వెబ్‌ఆప్షన్లలో కనబడని కోర్సులు

2024–25 విద్యా సంవత్సరానికి ఏపీ ఈఏ ఎమ్‌సెట్ చేపట్టిన ఆన్‌లైన్ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఆప్షన్లు కనిపించలేదు. మార్కెట్లో డిమాండ్ ఉన్న ఈ కోర్సులలో చేరేందుకు ఎంతో ఆశతో ఉన్న విద్యార్థులకు నిరాశే ఎదురైంది. వెబ్ ఆప్షన్లలో కేవలం సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ మాత్రమే ఉండడంతో విద్యార్థులు అవాక్కయ్యారు.

ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసే కుట్ర

ప్రభుత్వ కళాశాలలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్ విద్యను ప్రోత్సహించేందుకు నూతన ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ భవనం

ఎస్వీయూ వర్సిటీ పరిధిలోని ఏకైక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను సైతం వెబ్‌ఆప్షన్స్‌లో పెట్టకుండా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. గత రెండేళ్లుగా కొనసాగిన కోర్సులను ఏకపక్షంగా తొలగించి ప్రైవేటు కళాశాలలో సీట్లు పెంచారని ఆరోపించారు. నూతన ప్రభుత్వం తీరుచూస్తే కార్పొరేట్ ప్రభుత్వాన్ని తలపిస్తోందని, త్వరలో విద్యార్థుల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

ఆప్షన్ పెట్టాలని వచ్చాం

ఎస్వీయూలో సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సుగా ఉన్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు వెబ్ ఆప్షన్ పెట్టాలని నెట్ సెంటర్‌కు వచ్చాం. ఇక్కడ చూశాక వెబ్‌ఆప్షన్స్‌లో ఎస్వీయూలో ఏఐ కోర్సు కనబడలేదు. ఇంటర్నెట్ స్లోగా ఉందేమోనని మరో సెంటర్‌కు వెళ్లి చూడగా అక్కడా ఇదే పరిస్థితి. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎస్వీయూలో ఎత్తివేశారని తెలిసింది. ప్రైవేటు విద్యాసంస్థల్లో లక్షల్లో ఫీజులు అడుగుతున్నారు. నూతన ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యత లేనేట్టు కనబడుతోంది.

–సుశీల, విద్యార్థి తల్లి, కొర్లగుంట, తిరుపతి

గంజాయి బ్యాచ్ వీరంగం

- మంగళంలో ప్రైవేటు విద్యాసంస్థ బస్సుపై రాళ్లతో దాడి
- భయాందోళనకు గురైన విద్యార్థినులు
- గంజాయి బ్యాచ్‌ని అదుపులోకి తీసుకున్న తిరుచానూరు పోలీసులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు పోలీసు స్టేషన్ పరిధిలోని మంగళంలో గంజాయి మత్తులో ఇద్దరు యువకులు మంగళవారం సాయంత్రం రోడ్లపై అడ్డుగా నిలిచి బీభత్సం సృష్టించారు. ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్సుపై రాళ్ల దాడి చేసి అద్దాలను ధ్వంసం చేశారు. స్థానికులు, తిరుచానూరు పోలీసుల కథనం.. ఓ ప్రైవేటు విద్యాసంస్థకు చెందిన బస్సు కళాశాలలో విద్యార్థినులను తీసుకొని రూట్ పై వారి ఇళ్ల వద్ద వదిలేందుకు మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైన్ వద్దకు చేరింది. అక్కడ పూర్తిగా గంజాయి మత్తులో ఉన్న బీటీఆర్ కాలనీకి చెందిన బాలు, మహేష్ బస్సుకు అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ మోగించాడు. దీన్ని తప్పుబడుతూ సమీపంలోని రాళ్లు తీసుకొని బస్సు అద్దాలపై విసిరారు. ఈ ఘటనతో బస్సులోని బాలికలు ఒక్కసారిగా భయాందోళనకు గురై అరుపులు, కేకలు పెట్టారు. బస్సు డ్రైవర్ కుమార్‌ను తన సీటు నుంచి కిందకు లాగి చితకొట్టారు. సమాచారం అందుకున్న వెంటనే తిరుచానూరు మంగళం అవుట్ పోస్టు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చెదరగొట్టారు. బస్సులో ఉన్న 25 మంది బాలికలను వాళ్ల తల్లిదండ్రులతో మాట్లాడి క్షేమంగా ఇళ్లకు పంపించారు. అనంతరం గంజాయి మత్తులో విర్రవీగిన యువకులను, బస్సును తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యువకుల దాడిలో కళాశాల బస్సు అద్దాలు ధ్వంసం



పోలీసుల అదుపులో గంజాయి సేవించిన బాలు, మహేష్